## క్లుప్తంగా

### గడువులోపు రీసర్వే పూర్తి చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ హమీద్‌బాషా

గాండ్లపెంట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకాన్ని పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ హమీద్‌బాషా తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐ మున్వర్ బాషా, మండల సర్వేయర్ ఆనంద్‌నాయక్, సచివాలయాల సర్వేయర్లు, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. మడుగువారిగొంది, మద్దివారిగొంది, సామాలగొంది తదితర గ్రామాల్లో భూముల రీ సర్వే సాగుతుందన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే రైతులకు తెలియజేసినట్లు పేర్కొన్నారు. సర్వే సమయంలో రైతులు హాజరు కావాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సర్వే చేయాలని అధికారులకు తెలిపారు.

### చేపల చెరువు వేలం

తలుపుల: మండలంలోని పులిగుండ్లపల్లి చెరువులో చేపల పెంపకానికి గురువారం ఈఓపీఆర్డీ శకుంతల, సర్పంచ్ సుగుణమ్మ ఆధ్వర్యంలో ఈఓ మాధవరెడ్డి వేలం పాట నిర్వహించారు. 8 మంది రూ.5 వేల చొప్పున డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొన్నారు. వీరిలో వెంకటనారాయణ, ఆంజనేయులు రూ.3.10 లక్షలకు చేపల చెరువును దక్కించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు లోకనాథరెడ్డి, సుబ్బయ్య, ఆంజినేయులు, శ్రీరాములు పాల్గొన్నారు.

### కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం చేస్తున్న కేతిరెడ్డి సుప్రియ

ముదిగుబ్బ: మండల పరిధిలోని సంకేపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఎం.నారాయణ స్వామి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సతీమణి కేతిరెడ్డి సుప్రియ గురువారం ఎమ్మెల్యే నివాసంలో రూ.20 వేలను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వేణుగోపాల్, హరి, చిన్న నారాయణ, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.


### ఆసుపత్రి భవనం అప్పగింత



రికార్డులపై సంతకాలు చేస్తున్న అధికారులు

తలుపుల: మండల కేంద్రంలో ఆధునిక వసతులతో రూ.1.88 కోట్లతో నూతనంగా నిర్మించిన భవనాన్ని గురువారం వైద్యులకు అప్పగించారు. ఆర్‌అండ్‌బీ డీఈ శైలజ, జేఈ నరసింహులు, కాంట్రాక్టర్ పురుషోత్తంరెడ్డి తదితరులు వైద్యాధికారులు మున్వర్‌బాషా, సల్మాకు అప్పగించారు. భవనంలో వసతులు కల్పిస్తామని కాంట్రాక్టర్ హామీ ఇచ్చారు. రికార్డుల్లో సైతం అధికారులు సంతకాలు చేసుకున్నారు. వైద్యాధికారి మున్వర్ బాషా మాట్లాడుతూ.. త్వరలో నూతన భవనంలో వైద్య చికిత్సలు ప్రారంభిస్తామన్నారు.మాజీ సర్పంచ్ ఫయాజ్ అహమ్మద్, గ్రామ కన్వీనర్ రాజగోపాల్‌రెడ్డి, సథారెడి పాల్గొన్నారు.

### విశ్వకర్మల అభివృద్ధికి కృషి



ఐక్యత చాటుతున్న విశ్వకర్మ కులస్తులు

పుట్టపర్తి అర్బన్: విశ్వకర్మల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేద్దామని ఆర్టిసన్ రాష్ట్ర కన్వీనర్ చందమూరి బంగారు బాబు పేర్కొన్నారు. గురువారం పుట్టపర్తికి విచ్చేసిన ఆయన పుట్టపర్తిలోని ఓ ప్రైవేటు హోటల్‌లో విశ్వకర్మ కులస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశ్వకర్మలు అందరూ కలసికట్టుగా ఉంటే ఏదైనా సాధించుకోవచ్చన్నారు. కప్పలబండ వద్ద ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ఆవరణ కబ్జా కాకుండా కాపాడుకోవాలన్నారు. ఆలయాన్ని అభివృద్ధి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆర్టిసన్ కార్డు మంజూరు చేస్తోందన్నారు. దీని ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకూ రుణాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.

### ఆర్థికసాయం అందజేత

కదిరి అర్బన్: పట్టణానికి చెందిన హసీనా కుమార్తె షాహీదా వివాహానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తల హరిప్రసాద్ గురువారం రూ.10 వేలు అందజేశారు. మండల పరిధిలోని కుమ్మరవాండ్ల పల్లిలో గురువారం ఈ మొత్తాన్ని మాజీ సర్పంచ్ బత్తల వెంకటరమణ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మన్సూర్, సాహెబ్, శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

# ప్రజల వద్దకే ప్రభుత్వ పథకాలు

- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు సిద్దారెడ్డి, కేతిరెడ్డి



ఎన్‌పీకుంట: వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి



ధర్మవరం: సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ఎన్‌పీకుంట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల వద్దకే సంక్షేమ పథకాలను చేరవేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అన్నారు. ఎన్.పీ.కుంట పంచాయతీ కేంద్రంలోని అంబేడ్కర్ నగర్, బ్యాంక్ బజార్, ఇందిరా కాలనీ, వికలాంగుల కాలనీల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. పథకాల బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అలాగే ప్రజల సమస్యలను సానుకూలంగా విని తగిన పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. ఇందిరా కాలనీలో పక్షవాతంతో మంచానికి పరిమితమైన ఆంజినేయులును పరామర్శించారు. బాధితుడికి పింఛన్ మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వికలాంగుల కాలనీకి రోడ్డు సౌకర్యం కల్పించాలని కాలనీ వాసులు కోరారు. స్పందించిన ఎమ్మెల్యే రహదారి ఏర్పాటు చేయక పోవడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమస్యను పరిష్కరించి రహదారి ఏర్పాటు చేస్తామని తెలిపారు. అంబేడ్కర్ నగర్ కాలనీలో వర్షాలు కురిసినప్పుడు సీసీ రోడ్డుపై నీరు నిల్వ ఉండకుండా చూడాలని కోరారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డైనింగ్‌హాల్ ఏర్పాటు చేయించాలని హెచ్‌ఎం శిరీషారెడ్డి, ఉపాధ్యాయులు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఎస్టిమేట్ సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌కు సూచించారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థకు 10 సెంట్ల ప్రభుత్వ భూమిని చూపించాలని సంస్థ సభ్యులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. అలాగే పొజిషన్ సర్టిఫికెట్లు, ఇంటి పట్టాలు, పింఛన్లు తదితర సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి వచ్చాయి. సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సుమారు రూ.2.80 కోట్ల సీఎస్‌ఆర్ నిధులతో మండల కేంద్రంలోని ప్రతి వీధిలో సీసీ రోడ్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు సకాలంలో చేరవేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ జనరంజక పాలన అందిస్తున్న జగనన్నకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈటె రాము, బీసీ నేత బాలక్రిష్ణ నాయుడు, వైస్ ఎంపీపీ కేశవరెడ్డి, ఎంపీడీఓ ఆదినారాయణ, ఎంపీటీసీలు మగ్బూల్‌బీ, తిమ్మారెడ్డి, కొత్తరంగారెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు సుబహాన్, సర్పంచులు నాగమునీశ్వర నాయుడు, జేసీఎస్ కన్వీనర్ ఆదినారాయణ రెడ్డి, బీసీ సెల్ కన్వీనర్ ఆదెప్ప నాయుడు, వాటర్‌షెడ్ చైర్మెన్లు బయారెడ్డి, ఓబుళరెడ్డి, సచివాలయ కన్వీనర్లు వెంకటేశ్వర్లు, రామకృష్ణ, మాజీ ఎంపీపీ సోమిరెడ్డి, స్థానిక నాయకులు ఆటోక్రిష్ణ, తిరుమల నాయుడు, గోవిందునాయక్, గంగిరెడ్డి, వెంకటరామిరెడ్డి, ఉప సర్పంచ్ భాస్కర్ రెడ్డి, వాసుదేవరెడ్డి, కేశవ పాల్గొన్నారు.

**అర్హులకు పథకాలు అందాలి..**

ధర్మవరం: ప్రజల ఇంటి వద్దకే వెళ్తూ ప్రజల సమస్యలను తెలుసుకుని సత్వరమే పరిష్కరించడానికే గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. పట్టణంలోని 28వ వార్డులో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వార్డులో ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రహదారులు నిర్మించాలని, కాలువలు నిర్మించాలని పలువురు ఎమ్మెల్యేకు విన్నవించారు. వీధి లైట్లు ఏర్పాటు చేయించాలని కోరారు. జగనన్న కాలనీలో ఇళ్లు వచ్చాయని బిల్లులు పడలేదని పలువురు లబ్ధిదారులు తెలిపారు. వెంటనే లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించాలని సచివాలయ సిబ్బందిని ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం సచివాలయ సిబ్బందితో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వం ప్రతి అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు. సచివాలయ ఉద్యోగులంతా తప్పనిసరిగా ప్రజలకు సేవ చేయాలని ఆదేశించారు. ప్రజలతో మర్యాదగా మాట్లాడుతూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, వార్డు కౌన్సిలర్ ఆషా, వార్డు ఇన్‌చార్జ్ సరితాల బాషా, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

### 13 నుంచి ఎఫ్‌వీఎఫ్ క్రికెట్ టోర్నీ

బత్తలపల్లి: బత్తలపల్లి ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్‌లో ఈనెల 13 నుంచి 16వ తేదీ వరకూ ఎఫ్‌వీఎఫ్ (ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్) టీ20 క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈ టోర్నీలో విన్సెంట్ టీమ్, అన్నే టీమ్, మాంచో టీమ్, విషా టీమ్‌లు తలపడనున్నాయి. టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌కు ముఖ్య అతిథులుగా ఆర్డీటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నే ఫెర్రర్, ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ డైరెక్టర్ విశాల ఫెర్రర్, హెడ్ కోచ్ యుగంధర్‌రెడ్డి హాజరవుతారు.

### రేపు మెగా జాబ్‌మేళా

ధర్మవరం: నిరుద్యోగుల కోసం ఈనెల 8వ తేదీన మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నామని శ్రీసాయి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ చాంద్‌బాషా తెలిపారు. పట్టణంలోని శ్రీసాయి డిగ్రీ కళాశాలలో గురువారం జాబ్‌మేళా పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ.. టెక్ మహీంద్ర, కన్‌సెన్‌ట్రిక్స్, ముత్తూట్ ఫిన్‌కోర్, ముత్తూట్ ఫైనాన్స్, స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ తదితర కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. 2020, 2021, 2022 సంవత్సరాల్లో డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తి చేసిన వారు.. 2023 సంవత్సరంలో మూడో సంవత్సరం డిగ్రీ చదువుతున్న విద్యార్థులు జాబ్‌మేళాలో పాల్గొనేందుకు అర్హులన్నారు. జాబ్ మేళాకు నాలుగు పాస్‌పోర్టు సైజు ఫోటోలు, నాలుగు రెజ్యూమ్స్ తీసుకుని రావాలన్నారు.

### వ్యక్తి ఆత్మహత్య

బత్తలపల్లి: అప్పుల బాధతో ఊజీ మాత్రలు మింగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని తంబాపురం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. బత్తలపల్లి పోలీసులు తెలిపిన వివరాలు.. తంబాపురం గ్రామానికి చెందిన ముసుగు వీరనారప్ప (57)కు ఇద్దరు భార్యలు. కుమారుడు, కుమార్తె వివాహాలు, నూతనంగా నిర్మించిన ఇంటికి అప్పులు చేశాడు. బుధవారం రాత్రి ఇంట్లో ఎవరికి చెప్పకుండా బత్తలపల్లికి వచ్చాడు. బత్తలపల్లిలోని ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయం సమీపంలో ఊజీ మాత్రలు మింగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించగా.. అక్కడ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ టీవీ శ్రీహర్ష తెలిపారు.

### జగ్జీవన్ రామ్‌కు నివాళి

ధర్మవరం అర్బన్: జగ్జీవన్‌రామ్ వర్ధంతిని ఎమ్మార్పీఎస్ నాయకులు నిర్వహించారు. పట్టణంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. మాజీ ఉప ప్రధానిగా ఉంటూ దేశానికి ఎనలేని సేవలు అందించారన్నారు. ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బూదెప్ప, రామంజినేయులు, శివప్రసాద్, గంగాధర్, నారాయణ, ప్రసాద్, పవన్, నితిష్, కామేష్, కామరాజు, అంజి, రామంజినేయులు పాల్గొన్నారు.

### 'హర్ దిల్ మే వైఎస్సార్'

పుట్టపర్తి: ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆదేశాలతో కొత్తచెరువులోని హజరత్ మస్తాన్‌వలి దర్గా మజీద్‌లో హర్ దిల్ మే వైఎస్సార్ హమ్ సబ్ జగన్ కే సాత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ మొగల్ నూరుల్లా, వైస్ ప్రెసిడెంట్ షాజహాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు భాషాఖాన్, ఏహాసన్, మహబూబ్, బాబా ఫక్రుద్దీన్, ఎంపీటీసీ రఫీ, షాదీ మహల్ చైర్మన్ జహీర్, అరీష్, బాబా, అజూ, తదితరులు పాల్గొన్నారు.

### మొక్కలను సంరక్షించాలి

తలుపుల: మండలంలోని ఎగువ నిగ్గిడి గ్రామంలో గురువారం వన మహోత్సవం నిర్వహించారు. ఎఫ్‌ఈఎస్ సంస్థ సుభాషిణి, పుష్ప, శేఖర్ రెడ్డి, పర్యావరణ పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. మొక్కలతో భవిష్యత్ ఉంటుందన్నారు.

### నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

ఓడీ చెరువు: మండలంలోని కొండకమర్ల సచివాలయం–1 పరిధిలోని ఓబుళరెడ్డిపల్లి, గంగిరెడ్డిపల్లి, కొండకమర్ల (వైఎస్సార్ సర్కిల్) గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి హాజరవుతారని పార్టీ మండల కన్వీనర్ రాజునాయుడు, టౌన్ కన్వీనర్ కోళ్లకృష్ణారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సచివాలయ కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, వలంటీర్లు, బూత్ కమిటీ మేనేజర్లు, పాల్గొనాలన్నారు.

**టీఎస్‌పల్లి పంచాయతీలో..**

ఎన్‌పీకుంట: టీఎస్‌పల్లి పంచాయతీలో శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ ఈటె రాము, ఎంపీడీఓ ఆదినారాయణ గురువారం తెలిపారు. చల్లావాండ్లపల్లిలో ఉదయం 7 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, హాజరుకావాలని కోరారు.

### హెచ్‌ఎం బాధ్యతల స్వీకరణ

తలుపుల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ నూతన హెచ్‌ఎంగా కే.శంకరన్న గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కళ్యాణదుర్గం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీడీగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. పాఠశాలకు మంచి పేరు తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు.

## జగనన్న సురక్షతో అర్హులకు న్యాయం



లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి

బత్తలపల్లి/ధర్మవరం అర్బన్/తాడిమర్రి/గాండ్లపెంట/అమడగూరు/ఓడీ చెరువు/నల్లమాడ/నల్లచెరువు/తనకల్లు: ధర్మవరం, కదరి, పుట్టపర్తి నియోజకవర్గాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. పలుచోట్ల అధికారులు, ప్రజాప్రతినిధులు వైఎస్సార్‌సీపీ నాయకులు లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ధర్మవరంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తదితరులు పాల్గొన్నారు. నల్లచెరువు మండలం ఓరువాయిలో జరిగిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామలక్ష్మమ్మ, స్పెషలాఫీసర్ సూర్యనారాయణ, సర్పంచ్ గంగాదేవి, జేసీఎస్ మండల కన్వినర్ రాజశేఖర్ పాల్గొన్నారు. నల్లమాడ మండలంలోని యర్రవంకపల్లిలో లబ్ధిదారులకు జిల్లా విద్యాశాఖాధికారి రంగస్వామి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వలంటీర్లు, అధికారులు ఇంటింటికీ తిరుగుతూ సర్వే చేపట్టాలన్నారు. అర్హులకు పథకాలు అందించాలని ఆదేశించారు. ఇందులో అలసత్వం వహించొద్దన్నారు. ఓడీచెరువు మండలంలోని ఇనగలూరు పంచాయతీలో జరిగిన కార్యక్రంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజునాయుడు, తహసీల్దార్ రామనాథరెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రెడ్డెప్ప పాల్గొన్నారు. అమడగూరు మండలంలోని తుమ్మల గ్రామ పంచాయతీలో 728 మందికి సర్టిఫికెట్లు మంజూరు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్‌లు లక్ష్మీనరసమ్మ, ఆదినారాయణ, ఎంపీటీసీ లక్ష్మీపతి పాల్గొన్నారు. తాడిమర్రి మండలం ఎం.అగ్రహారంలో ఎంపీడీఓ విజయలక్ష్మి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఏటీ ఓబిరెడ్డి, ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి, జీఎస్‌డబ్ల్యూఎస్ నోడల్ అధికారి శివారెడ్డి, తహసీల్దార్ నాగరాజు, ఈఓపీఆర్డీ కామాక్షి పాల్గొన్నారు.

### మద్యం అమ్మితే కఠిన చర్యలు

పుట్టపర్తి టౌన్: అక్రమ మద్యం అమ్మితే కఠిన చర్యలు తప్పవని కొత్తచెరువు ఎస్‌ఐ లింగన్న హెచ్చరించారు. గురువారం ఉదయం కొత్తచెరువు తహసీల్దార్ కార్యాలయం వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. బుక్కపట్నం గ్రామానికి చెందిన ఈడిగ చంద్రశేఖర్ 40 ఆంధ్రా క్వాటర్ బాటిళ్లు తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

### 18 నుంచి క్రికెట్, కబడ్డీ పోటీలు

ధర్మవరం: ఈనెల 18వ తేదీ నుంచి విన్సెంట్ ఫెర్రర్ స్కూల్ క్రికెట్, కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు క్రికెట్ కోచ్ రాజశేఖర్, కబడ్డీ కోచ్ పృథ్వీ, హాకీ కోచ్ అనిల్‌కుమార్ తెలిపారు. గురువారం ఈరకరామాపురంలో ఉన్న ఆర్డీటీ క్రీడా మైదానంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఈనెల 13వ తేదీలోపు ఆసక్తి ఉన్న స్కూళ్లు వారి విద్యార్థుల పేర్లను నమోదు చేయించుకోవాలని తెలిపారు. వివరాలకు 9985929285, 9966492540 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

### ఉచితంగా రాగులు, కొర్రల పంపిణీ

ఎన్‌పీకుంట: ఖరీఫ్ సీజన్‌లో చిరుధాన్యాలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం ఉచితంగా రాగులు, కొర్రలు అందిస్తోందని మండల వ్యవసాయ అధికారి లోకేశ్వర రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో ఆయన మాట్లాడారు. మండలానికి నాలుగు క్వింటాళ్ల రాగులు, రెండు క్వింటాళ్ల కొర్రలు వచ్చాయని తెలిపారు. ఒక్కో రైతుకు గరిష్ఠంగా 8 కిలోల చొప్పున ఉచితంగా అందిస్తామన్నారు. చిరుధాన్యాల కోసం రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

### చైర్మన్ పదవి నుంచి వైదొలుగుతున్నా

తనకల్లు: వ్యవసాయ మార్కెట్‌యార్డ్ చైర్మన్ పదవి నుంచి వైదొలుగుతున్నట్లు ఈశ్వర్‌రెడ్డి గురువారం విలేకరులకు తెలిపారు. వైఎస్సార్‌సీపీ కోసం కష్టపడి పని చేసిన వారికి మార్కెట్‌యార్డ్ చైర్మన్ పదవి ఇవ్వాలన్నారు. ఏడాది పాటు మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా పని చేయడానికి సహకరించిన ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కొన్ని కారణాల వల్ల చైర్మన్ పదవి నుంచి తప్పుకుంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నాగభూషణ, డైరెక్టర్ పూల శీన పాల్గొన్నారు.

### వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

తనకల్లు: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మండల వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. స్థానిక కేజీబీవీలో గురువారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాతావరణ పరిస్థితుల కారణంగా అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం 211 మంది విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేశారు. ఐరన్ పోలిక్ మాత్రలను అందజేశారు. ఎంపీహెచ్‌ఓ ఓబులేసు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

### అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటాలి



ప్రత్యూషను సన్మానిస్తున్న వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం, వీఎస్‌వీ ఫౌండేషన్ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని జీఎస్‌బీ ఫంక్షన్ హాల్‌లో గురువారం వీఎస్‌వీ ఫౌండేషన్ సభ్యులు వెంకటనారాయణ, వేణుగోపాల్, శ్రీధర్, రవి కుమార్ ఆధ్వర్యంలో పరుగుల రాణి ప్రత్యూషను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీఐ సుబ్రమణ్యం, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆర్‌డీడీ రాజారావు, ఏడీ రమేష్, బాలాజీనాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 28వ తేదీ నుంచి చైనా దేశంలో జరిగే పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు. అనంతరం వీఎస్‌వీ ఫౌండేషన్ సభ్యులు రూ.15 వేలు, ఆర్‌డీడీ రూ.10116 అందజేశారు. కార్యక్రమంలో వీఎస్‌వీ సభ్యులు నల్లప్ప, వెంకటస్వామి, విజయభాస్కర్, నవీన్, రాజా, అక్కులప్ప తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాతల జీవితాల్లో వెలుగులు



నరసంపల్లిలో బోరు తవ్వకాన్ని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు

కనగానపల్లి: తోపుదుర్తి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రైతులకు ఉచితంగా బోర్లు వేయిస్తున్న రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నదాతల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని జెడ్పీటీసీ సభ్యుడు మారుతీప్రసాద్ తెలిపారు. గురువారం మండలంలోని నరసంపల్లి గ్రామంలో జరుగుతున్న ఉచిత బోర్ల కార్యక్రమాన్ని మండల వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి ఆయన పరిశీలించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన జలకళ కార్యక్రమానికి కొనసాగింపుగా ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి తన ట్రస్టు సొంత నిధులను వెచ్చించి, గ్రామాల్లో పేద రైతులకు ఉచితంగా బోర్లు వేయిస్తున్నారన్నారు. కనగానపల్లి మండలానికి వెయ్యి బోర్లు కేటాయించగా, ప్రస్తుతం నరసంపల్లి గ్రామంలో 36 బోర్లు రైతులకు వేయించారన్నారు. వీటిలో 95 శాతం బోర్లలో నీరు సమృద్ధిగా పడటంతో స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పరిటాల కుటుంబం ఫ్యాక్షన్ రాజకీయాలతో ఈ ప్రాంతంలో రక్తం పారించగా, ప్రస్తుతం ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి రైతులకు సాగునీరందిస్తూ ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలంగా మారుస్తున్నారన్నారు. కానీ ప్రతిపక్ష టీడీపీ నాయకులు, పరిటాల కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేపై అనవసర ఆరోపణలు చేస్తూ వచ్చే ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారన్నారు. ఉచిత బోర్ల ద్వారా తమకు నీరు సమృద్ధిగా పడ్డాయని, ఇందుకు ఎమ్మెల్యే ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు స్థానిక రైతులు చన్నకేశవులు, ఈశ్వరయ్య, శ్రీనివాసులు, తదితరులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, మండల అగ్రి బోర్డు చైర్మన్ వెంకటరాముడు, డైరెక్టర్ ప్రభాకర్, ఎంపీటీసీలు కృష్ణారెడ్డి, దాదాఖలందర్, నాయకులు నాగముని, భాస్కరరెడ్డి, శ్రీనివాసులు, నారాయణ రెడ్డి, అంకే గోపాల్, సుబ్బరాయుడు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### గ్లోబల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఆర్‌జె.రత్నాకర్ రాజు, చక్రవర్తి

ప్రశాంతి నిలయం: సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ సభ్యులు ప్రపంచ వ్యాప్తంగా ఆయా దేశాల్లో నిర్వహిస్తున్న సత్యసాయి సేవా కార్యక్రమాలను ప్రదర్శిస్తూ ఎగ్జిబిషన్‌ను గురువారం ఏర్పాటు చేశారు. ప్రశాంతి నిలయంలోని షాపింగ్ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న సత్సంగ్ భవన్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు, గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి, ఉపాధ్యక్షుడు నమిష్ పాండ్య ప్రారంభించారు. గ్లోబల్ కౌన్సిల్ సభ్యులు ఏర్పాటు చేసిన ప్రదర్శనలను తిలకించారు. వివిధ జోన్‌ల పరిధిలో ఆయా దేశాల్లో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలను వివరిస్తూ ఏర్పాటు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

### జక్కల ఆదిశేషుకు మాతృ వియోగం




జక్కల అక్కమ్మ (ఫైల్)

తనకల్లు: వైఎస్సార్‌సీపీ నేత జక్కల ఆదిశేషు తల్లి జక్కల అక్కమ్మ (65) అనారోగ్యంతో మృతి చెందాడు. జక్కల అక్కమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమె గురువారం ఉదయం వైఎస్సార్ జిల్లా పులివెందులలో తుదిశ్వాస విడిచారు. అక్కమ్మ మృతికి పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాగా శుక్రవారం స్వగ్రామమైన బొంతలపల్లిలో అంత్యక్రియలు నిర్వహిస్తామని జక్కల ఆదిశేషు తెలిపారు.

**నివాళులర్పించిన ఎమ్మెల్యే..**

విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి బొంతలపల్లిలో జక్కల అక్కమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. ధైర్యంగా ఉండాలని జక్కల ఆదిశేషు, కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాలు హర్షించేలా జగనన్న పాలన



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి

బత్తలపల్లి: అన్ని వర్గాలు హర్షించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో 'గుడ్ మార్నింగ్ ధర్మవరం' కార్యక్రమం నిర్వహించారు. ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డితో కలిసి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయా? అని ఆరా తీశారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. జగన్ పాలనలో ఇంటి వద్దకే పథకాలు అందుతున్నాయని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. అంతకుముందు ప్రజలు తమ కాలనీలో మురుగు కాలువలు, నీటి కుళాయిలు, సిమెంట్ రోడ్డు వేయాలని విన్నవించారు. కార్యక్రమంలో సర్పంచు అక్కిం కాశమ్మ, సింగిల్‌విండో డైరెక్టర్ ఈడిగ కాశప్ప, కో–ఆప్షన్ మెంబర్ కరీంసాబ్, జీక్రియా, వడ్డె ప్రసాద్, కప్పల సుదర్శన్, సాకే గోపాల్, కుమ్మర వెంకటరమణ, అరుణ, పంచాయతీ కార్యదర్శి ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

### ప్రమాదంలో యువకుడి మృతి

కదిరి టౌన్: పట్టణంలోని దత్త ఫంక్షన్ హాల్ సమీపంలో గురువారం ఆగివున్న ఇన్నోవా కారును ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో మహమ్మద్ రఫీ (24) మృతి చెందినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. వివరాలు.. పట్టణంలోని అడపాల వీధికి చెందిన నబీరసూల్ కుమారుడు మహమ్మద్ రఫీ బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి కుటాగుళ్ల వైపు నుంచి కదిరికి ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. దత్త ఫంక్షన్ హాల్ సమీపంలో ఆగివున్న ఇన్నోవా కారును ప్రమాదవశాత్తూ ఢీకొట్టాడు. ఈ ఘటనలో గాయపడిన రఫీని చికిత్స నిమిత్తం 108లో కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా.. మహమ్మద్ రఫీ భార్యకు శుక్రవారం సీమంతం ఉండటంతో పనిమీద కుటాగుళ్లకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### పెంపుడు కుక్కలకు టీకాలు

బత్తలపల్లి/ధర్మవరం రూరల్/కనగానపల్లి: పెంపుడు కుక్కలకు యాంటి రేబిస్ టీకాలు వేస్తున్నట్లు ప్రాంతీయ పశువైద్యశాల ఏడీ శ్రీనివాసులు, పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు వీరభద్రయ్య తెలిపారు. గురువారం బత్తలపల్లి, ధర్మవరం, కనగానపల్లిలో కుక్కలకు టీకాలు వేశారు.